
సాక్షి
నిజామాబాద్
మంగళవారం ❘ 18 ❘ జూలై ❘ 2023



సాగుకు ప్రోత్సాహమేది ?

కూరగాయల పంటలకు ప్రభుత్వం నుంచి రాయితీతో కూడిన ప్రోత్సాహకాలు లేకపోవడంతో రైతులకు సాగు భారమైంది.

- 8లో ▸



ఎస్సారెస్పీ వద్ద స్కాడా ఏర్పాటు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు కంట్రోల్ రూంలో స్కాడా (సూపర్ వైజరి కంట్రోల్ డాటా అక్విజేషన్) విధానాన్ని ఏర్పాటు చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.7 /22.7

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పల్లెవెలుగు టౌన్ బస్‌పాస్‌లు

- 5 కిలోమీటర్లకు నెలకు రూ. 500

ఖలీల్‌వాడి: ప్రయాణికుల ఆర్థిక భారం తగ్గించేందుకు కొత్తగా పల్లెవెలుగు టౌన్ బస్ పాస్‌కు టీఎస్ ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంలో తిరిగే పల్లె వెలుగు బస్సుల్లో ఈ పాస్‌ను అమలు చేయాలని సంస్థ నిర్ణయించినట్లు డిప్యూటీ ఆర్ఎం(ఆపరేషన్) సరస్వతి తెలిపారు. టౌన్ పాస్‌తో ప్రయాణికులు 5 కిలోమీటర్ల పరిధికి రూ. 500లు ధరను సంస్థ ఖరారు చేసినట్లు తెలిపారు. పాస్‌ను జిల్లా కేంద్రాల్లో అమలు చేయాలని ప్రయాణికుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు కొత్తగా పల్లెవెలుగు టౌన్ బస్‌పాస్‌ను సంస్థ అమలులోకి తెచ్చిందన్నారు. ఈ కొత్త పాస్ మంగళవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులు, చిరువ్యాపారులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. బస్ పాస్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్ ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని కోరారు.

21న జాబ్ మేళా

- ఐటీ హబ్‌లో ఉద్యోగాల కోసం..

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐటీ హబ్‌లో ఉద్యోగాలు కల్పించడానికి ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని బోర్గాం(పి)లో గల భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలోనే నూతన కలెక్టరేట్ ఆవరణలో ఐటీ హబ్ ప్రారంభించడం జరుగుతుందన్నారు.

'నిజాంసాగర్'లోకి 773 క్యూసెక్కుల రాక

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 773 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలకుగాను సోమవారం సాయంత్రానికి 3.252 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

గాడిన పడేనా?



ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ

తెయూలో పాలన అస్తవ్యస్తం

- ఇన్‌చార్జి వీసీ నియామకంతో సమస్యలు పరిష్కారమయ్యేనా..
- ఈసీ తీర్మానాల అమలు జరిగేనా..?
- విద్యార్థులు, అధ్యాపకుల్లో జోరుగా సాగుతున్న చర్చ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఈ నెల 13న నియమితులయ్యారు. తెయూ వీసీగా పని చేసిన డి.రవీందర్ గత నెల 17న ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాల యజమాని నుంచి రూ. 50వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడిన కేసులో జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. దీంతో నెల రోజుల పాటు వీసీ లేక గాడితప్పిన వర్సిటీ పాలన ఇన్‌చార్జి వీసీ నియామకంతో ఇకనైనా సరైన దారిలో పడుతుందని విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు. అలాగే గత నెల 17న జరిగిన పాలకమండలి (ఈసీ) సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను వీసీ లేకపోవడంతో అమలు చేయలేకపోయారు. ఇప్పుడు ఏకంగా విద్యాశాఖ కార్యదర్శియే ఇన్‌చార్జి వీసీగా రావడంతో వర్సిటీ పాలనలో విధానపరమైన నిర్ణయాలను సత్వరంగా అమలు చేసే అవకాశం ఉంది. ఉన్నత విద్యకు సంబంధించి నియమ, నిబంధనలు, పరిపాలనా వ్యవహారాల ఉత్తర్వులపై అవగాహన కలిగిన ఉన్నతాధికారి కావడంతో అక్రమార్కుల గుండెల్లో వణుకు మొదలైంది.

61వ ఈసీ సమావేశంలో పలు తీర్మానాలు

తెయూ 61వ ఈసీ సమావేశం గతనెల 17న హైదరాబాద్‌లోని రూసా భవనంలో అప్పటి కళాశాల విద్యాకమిషనర్ నవీన్‌మిట్టల్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఈసీ పలు తీర్మానాలు ఆమోదించింది. ఇందులో భాగంగా ఆమోదం లేకుండా వీసీ రవీందర్ నియమించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు కనకయ్య, శివశంకర్, విద్యావర్ధినిలపై నిర్ధారిత నేరారోప అభియోగాల(ఆర్టికల్ ఆఫ్ చార్జెస్) కింద కేసులు నమోదు చేయాలి. వీసీ అవినీతి, అక్రమాలకు సహకరించిన కనకయ్య, విద్యావర్ధినులను సస్పెండ్ చేయాలి. ఏరియర్స్ పేరిట అక్రమంగా రూ. 10లక్షలు తీసుకున్న కాంట్రాక్టు అధ్యాపకుడు శ్రీనివాస్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలి (రిమూవల్). వివిధ కారణాలతో వీసీ పీఏలు, ఇతర సిబ్బంది తీసుకున్న అడ్వాన్సులు మొత్తం వెంటనే రికవరీ చేయాలి. 2021 -2023 వరకు నిర్వహించిన పీహెచ్‌డీ అడ్మిషన్లపై ఉస్మానియా వర్సిటీ అధ్యాపకుల కమిటీ ద్వారా విచారణ జరిపించాలని తీర్మానించారు. అయితే ఈసీ సమావేశం రోజునే వీసీ రవీందర్ ఏసీబీకి పట్టుబడి జైలుకు వెళ్లారు. ఈసీ తీర్మానాలు అమలు చేయాలంటే వీసీ నోట్‌షీట్ ఉండాలి. ఇన్‌చార్జి వీసీ రాగానే ఈసీ తీర్మానాలు అమలు చేసేందుకు వర్సిటీ అధికారులు అన్ని సిద్ధం చేసి ఉంచారు. అయితే ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీ నియామకం విషయంలో తీవ్ర జాప్యం చేసింది. ఎట్టకేలకు వీసీ రవీందర్ బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆగమేఘాలపై వాకాటి కరుణను ఇన్‌చార్జి వీసీగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన వాకాటి కరుణకు వీసీ రవీందర్ చేసిన అక్రమాలు, అవినీతి పై పూర్తి అవగాహన ఉంది. అయితే అన్ని సిద్ధంగా ఉన్నప్పటికీ గతంలో వీసీ హైకోర్టును ఆశ్రయించిన కేసు ఇంకా పెండింగ్‌లో ఉండడంతో ఈసీ తీర్మానాల అమలులో మరికొంత ఆలస్యం జరిగే అవకాశం కనిపిస్తోంది.

కోర్టు తీర్పు రాగానే చర్యలు



ఏప్రిల్, మే నెలల్లో జరిగిన తెయూ పాలకమండలి సమావేశాల తీర్మానాల రద్దు విషయమై వీసీ రవీందర్ హైకోర్టులో కేసు వేశారు. గత నెల 26న కోర్టు లో కేసు హియరింగ్‌కు వచ్చింది. అయితే ఆలస్యం కావడంతో వాదనలు జరగలేదు. దీంతో కేసు ఆగ స్టు 2కు వాయిదా పడింది. ఇదే విషయమై ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణతో మాట్లాడాను. ఈ సారి ప్రభుత్వం, వర్సిటీ తరఫున కోర్టు లో వాదనలు వినిపించి కో ర్టు తీర్పుకు అనుగుణంగా ఈసీ తీర్మానాల అమలుకు చర్యలు తీసుకుంటాం.
– ఎం యాదగిరి, రిజిస్ట్రార్, తెయూ

కమిషనర్‌కు సమస్యల స్వాగతం

- కార్పొరేషన్‌లో అంతా గందరగోళం
- అధ్వానంగా మారిన సానిటేషన్
- అక్రమాలకు అడ్డాగా టౌన్‌ప్లానింగ్
- నాసిరకం పనులు చేపడుతున్న ఇంజినీరింగ్ విభాగం
- రెవెన్యూ వసూళ్లలో అలసత్వం
- సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న బల్దియా



పాత హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ కార్పొరేషన్‌కు రానున్న మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్‌కు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కార్పొరేషన్‌లో పరిస్థితి అంతా గందరగోళంగా మారింది. సానిటేషన్ అస్తవ్యస్తంగా తయారు కాగా.. టౌన్ ప్లానింగ్‌లో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇంజినీరింగ్ విభాగం నాసిరకం పనులు చేపడుతుండడం.. రెవెన్యూ వసూళ్లలో అలసత్వం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలు ఉన్నాయి. కనీసం సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చే ఫిర్యాదుదారుల కోసం ప్రజావాణి కూడా లేకుండా పోయింది. బల్దియా సమస్యల పరిష్కారం కోసం పూర్తిస్థాయి మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తారో చూడాలి.

చెత్త సేకరణ అంతంతమాత్రమే..

నగరంలో 60 డివిజన్‌లకు సంబంధించి ఐదు జోన్‌కార్యాలయాలున్నాయి. అయితే పర్యవేక్షణ కరువవడంతో చెత్త సేకరణ అంతంత మాత్రంగానే సాగుతోంది. ప్రతినిత్యం చెత్త వాహనాలు ఇంటింటికి తిరగాల్సి ఉన్నా అనేకచోట్ల రెండు, మూడు రోజులకు ఒక్కసారి వస్తున్నాయి. అధికారులు మాత్రం ప్రతినిత్యం తిరుగుతున్నాయని చెబుతున్నారు. ఈవిషయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. డంపింగ్ యార్డులో ఎరువుల తయారీ పక్కకు పడేశారు. రోడ్లు ఊడ్చే యంత్రాలను మూలనపడేశారు. ఇన్‌చార్జి కమిషనర్ 'సాక్షి'లో వచ్చిన కథనాలపై సీరియస్ కావడంతో కొంత గాడిలో పడింది.

అక్రమాలకు కేరాఫ్‌గా..

టౌన్‌ప్లానింగ్ అంటే అక్రమాలకు కేరాఫ్ అడ్రాస్‌గా మారింది. నగరంలో ఇళ్ల అనుమతుల్లో గందరగోళంగా మారింది. ధనవంతులు నిర్మాణాలు చేపట్టితే నిబంధనలు పక్కకు పెట్టి అనుమతులు ఇస్తు న్నారు. చిన్న, మధ్యతరగతి వారు ఇళ్లు నిర్మించు కుంటే కొర్రీలు పెట్టి మరీ అడ్డుతగులుతున్నారు. అవసరమైతే ఇళ్లు కూల్చివేసిన సందర్భాలున్నాయి. నగరంలో అక్రమ నిర్మాణాలు కోకోల్లాలు ఉన్నాయి. అక్రమాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులే అండగా ఉంటున్నారని పెద్ద చర్చే జరుగుతుంది. ముడుపులు ఇస్తే టౌన్‌ప్లానింగ్‌లో ఎలాంటి అక్రమాలైనా సక్రమం చేస్తారని ఆరోపణలు ఉన్నాయి.

నాసిరకం పనులతో ప్రజలకు ఇక్కట్లు

ఇంజినీరింగ్‌శాఖలో ద్వారా చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో సీసీ రోడ్లు కంకర తేలుతున్నాయి. బీటీ రోడ్లలో పగుళ్లు ఏర్పడుతున్నాయి. పదికాలాల పాటు ఉండాల్సిన రోడ్లు.. ఏడాది కాకముందే అధ్వానంగా తయారవుతున్నాయి. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెవెన్యూ వసూళ్లు అంతంతే..

రెవెన్యూ వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సామాన్యులు ఇంటి పన్నులు చెల్లించకుంటే రెవెన్యూ అధికారులు ఇంటికి వెళ్లి మరీ వస్తువులు తీసుకెళ్తున్నారు. అదే వ్యాపారులు, వ్యాపార సంస్థలు ఆస్తి పన్నులు చెల్లించకుంటే మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా వచ్చే కమిషనర్ అయినా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



నాసిరకం పనులతో వసంత్‌నగర్ కాలనీలో కంకర తేలిన సీసీ రోడ్డు

కాళేశ్వరం నీరు నిలిపివేత

బాల్కొండ: ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నుంచి పది రోజుల క్రితం ఎస్సారెస్పీలోకి ప్రారంభించిన రివర్స్ పంపింగ్‌ను సోమవారం అధికారులు నిలిపివేశారు. ప్రాజెక్టులోకి గోదావరి ద్వారా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడం వలన రివర్స్ పంపింగ్ ద్వారా నీటి సరఫరాను నిలిపివేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదలు వస్తే మళ్లీ దిగువకే వదిలే పరిస్థితి ఎదురవుతుంది. దీంతో ప్రభుత్వం నిర్ణయం మేరకు సరఫరా నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

2.55 టీఎంసీల నీరు చేరిక

ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా ప్రాజెక్టులోకి రివర్స్ పంపింగ్ చేసి పదిరోజుల నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు కాళేశ్వరం నీటిని సరఫరా చేశారు. నీటి విడుదల పెంచుతూ తగ్గిస్తూ నీటి సరఫరాను కొనసాగించారు. పంపులు నిలిపివేసే వరకు ప్రాజెక్టులోకి 2.55 టీఎంసీల నీరు వచ్చి చేరిందని అధికారులు తెలిపారు.



పంపుల ద్వారా నిలిచిన సరఫరా

30 టీఎంసీలు దాటిన నీటి నిల్వ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కాళేశ్వరం నీరు, ఎగువ ప్రాంతాల నుంచి గోదావరి నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి నిల్వ సోమవారం సాయంత్రానికి 30 టీఎంసీలు దాటింది. అయితే నీటి నిల్వ 50 టీఎంసీలకు చేరితే వానాకాలం పంటకు ఢోకా ఉండదు. ప్రాజెక్టులోకి మరో మూడు నెలలు ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున పంటలకు నీటి సరఫరాకు ఢోకా ఉండదని ప్రాజెక్టు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న వరద

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 15,330 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1070.70 అడుగుల(30.34 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



కాంగ్రెస్‌కు మద్దతిస్తే ఉచిత విద్యుత్ రద్దు

- కేంద్రం ఇచ్చిన నిధులు మళ్లించలేదు
- సీబీఐని మించిన విచారణ చేయించుకోవచ్చు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్ రైతు వేదిక వద్ద నిర్వహించిన నిరసన సభలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే ఉచిత విద్యుత్తు రద్దవుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్తుపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వేల్పూర్ రైతు వేదిక వద్ద నిర్వహించిన నిరసన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేయబోతుందో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల ద్వారా తెలుస్తోందన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు అవసరం లేదని రేవంత్ రెడ్డి ఎలా అంటాడని ప్రశ్నించారు. ఉచిత విద్యుత్తు ఇస్తే రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు వచ్చిన నష్టమేమిటన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 8 గంటల కరెంటు మాత్రమే అక్కడ ఇస్తుందని, వాళ్లు మిగుల్చుకున్న కరెంటును తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు ఇస్తోందన్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు జాతీయ విధానం ఉండదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో 24 గంటల కరెంటు ఇస్తారా లేదా అన్న విషయాన్ని రాహుల్‌గాంధీ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో కనీసం విద్యుత్తు లైన్లు కూడా వేయలేదన్నారు.

ఎంపీ అర్వింద్‌పై మంత్రి ఆగ్రహం

పసుపుబోర్డు తేకుంటే రాజీనామా చేస్తానని చెప్పి మోసం చేసిన ఎంపీ అర్వింద్ దర్జాగా తిరుగుతూ, కష్టపడుతున్న మాలాంటి వాళ్లను ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్లలో తప్పు చేయని ప్రశాంత్‌రెడ్డి ఇప్పుడు చేస్తాడా? ఎన్నికల ముందు ఎందుకు ఆరోపణలు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. ఎంపీకి అవగాహన లేదు, డబుల్ బిల్ తీసుకునే అవకాశమే లేదని, నిధులు అసలే మళ్లించలేదన్నారు. సెంట్రల్ అసిస్టెంట్ ఫైనాన్స్ కింద కేంద్రం రూ. 300 కోట్లు కేటాయించగా, దానిలో రూ. 70 కోట్లు బాల్కొండలో రోడ్లు, వంతెనలకు కేటాయించామన్నారు. దాన్ని తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తున్నారు. సీబీఐ విచారణకు మించిన విచారణ జరిపించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు నాయకుడు కోటపాటి నర్సింహానాయుడు, ఎంపీపీ బీమజమున, నాయకులు మిట్టపల్లి మహిపాల్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా నేతలతో ఏఐసీసీ కార్యదర్శి భేటీ

- రాజకీయ పరిస్థితులపై చర్చ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా రాజకీయ పరిస్థితులపై, భవిష్యత్తు కార్యాచరణపై ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన సోమవారం జిల్లా కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యారు. వచ్చే ఎన్నికలకు గురించి ఆరా తీసినట్లు సమాచారం. దీంతోపాటు వివిధ అంశాలపై చర్చించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో పని చేసిన ప్రతి నేతకు సముచిత స్థానం ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసి పని చేయాలని సూచించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, నేతలు ఈరవత్రి అనిల్, తాహెర్ బిన్‌హందాన్, కేశ వేణు, గడుగు గంగాధర్, నగేశ్ రెడ్డి, భూపతిరెడ్డి, అరికెల నర్సారెడ్డి, అన్వేష్‌రెడ్డి, ముప్పా గంగారెడ్డి, శేఖర్ గౌడ్, నీరడి భాగ్య, సంతోష్, లింగం, రాజ నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్

మెస్‌లో గొడవతోనే..

- మెడికో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
- సీనియర్లను విచారిస్తున్న కళాశాల అధికారులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మెడికల్ కళాశాలలో ఆదివారం మెడికో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి మెస్ విషయంలో జరిగిన గొడవే కారణమని తెలుస్తోంది. మెడికల్ కళాశాలలో బాయ్స్, గరల్స్ మెస్‌లు వేరుగా ఉండగా, బాయ్స్ మెస్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. గరల్స్ మెస్‌ను మెడికో సీనియర్లే ఇద్దరు పని మనుషులను పెట్టుకుని నడిపిస్తున్నారు. ఆత్మహత్యాయతాన్నికి పాల్పడిన రాజస్థాన్‌కు చెందిన యువతి, సీనియర్‌తో హాస్టల్ గదిలో ఉంటుంది. నెలరోజుల క్రితం మెస్‌లో రొట్టెలు బాగలేవంటూ ఆమె తన సీనియర్‌తో చెప్పగా, సీనియర్ తోటి సీనియర్లకు ఈ విషయాన్ని తెలిపింది. దాంతో వారు ×మేము సీనియర్లం ఏం చేసినా, ఎలా ఉన్నా తినాలి అంతేగాని వంటకాలు నచ్చలేదంటావా౯ అంటూ అప్పటి నుంచి యువతితో గొడవ పడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం సీనియర్లు పిలిచి తమకు సారీ చెప్పాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. దీంతో ఆ యువతి తీవ్ర మనస్తాపానికి గురై తన గదికి వచ్చి పారసిటమల్ ట్యాబెట్లు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన తోటి మెడికోలు వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సరైన సమయంలో ఆమెకు వైద్యం అంది ప్రాణాపాయం తప్పింది.

అవగాహన కల్పించినా..

మెడికల్ కళాశాలలో ఇప్పటివరకు శ్వేత, హర్ష, సనత్‌ల వరుస ఆత్మహత్యలు తోటి విద్యార్థులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. రాష్ట్రంలో ఏ మెడికల్ కళాశాలలో లేనిది ఇక్కడే ఎందుకు జరుగుతుందో అంతుపట్టకుండా ఉంది. దీనిని నివారించేందుకు కళాశాల విద్యార్థులకు మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ సైతం ఇప్పించారు. అయినప్పటికీ విద్యార్థులు తమకు ఎదురవుతున్న పరిణామాలు తట్టుకోలేక ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

విచారణ చేస్తున్నాం

– నాగమోహన్, వైస్ ప్రిన్సిపల్

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై ప్రాథమిక విచారణ జరిపాం. రాజస్థాన్‌కు చెందిన యువతి తన తల్లితో హిందీలో మాట్లాడుతుంటే అదే గదిలో ఉండే సీనియర్‌కు హిందీ భాష అర్థంగాక తన గురించే ఏదో మాట్లాడుతోందని తప్పుగా అర్థం చేసుకుంది. ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకుంది.

హాస్టల్ మెస్‌లో తయారు చేసే చపాతీలు చిన్నవిగా ఉండటం, వాటి రుచి రాజస్థాన్ యువతికి నచ్చకపోవటంతో ఈ చపాతీలు మా ఇంట్లో కుక్కలు కూడ తినవు అనటంతో సీనియర్ అలా మాట్లాడం ఏమిటని విషయాన్ని తన సీనియర్లకు తెలిపింది. దీనిపై సీనియర్లు రాజస్థాన్ యువతిని సారీ చెప్పాలని బలవంతం చేశారు. ఆమె సారీ చెప్పడానికి నిరాకరించి గోళీలను వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ విషయంలో సీనియర్లను పూర్తిగా విచారించి తప్పు ఎవరిదితో వారిపై చర్యలు తీసుకుంటాం.

ఓ ప్రజాప్రతినిధి వ్యవసాయ క్షేత్రంలో పేకాట

- చోద్యం చూస్తున్న పోలీసులు, టాస్క్‌ఫోర్స్?

ఖలీల్‌వాడి : మాక్లూర్ మండలంలోని ఓ మండల స్థాయి ప్రజాప్రతినిధి వ్యవసాయ క్షేత్రంలో జోరుగా పేకాట దందా సాగుతోంది. ఈ క్షేత్రంలోకి పోలీసులు, ట్రాస్క్‌ఫో ర్స్ పోలీసులు వెళ్లడానికి జంకుతున్నట్లు సమాచారం. ఎందుకంటే స దరు ప్రజాప్రతినిధికి నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి అండదండలు ఎక్కువగా ఉండటమే కారణంగా చెబుతున్నారు. దీంతో ఇది సేఫ్ జోన్‌గా భావించిన పేకాటరాయుళ్లు ఇక్కడ ఆడటానికి ప్రతి రోజు వెళ్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జిల్లాకు రెగ్యులర్ పోలీస్ కమిషనర్ లేకపోవడంతో కూడా పోలీసులు పేకాట స్థావరంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ పేకాట కేంద్రం నిర్వహణలో మాజీ ప్రజాప్రతినిధి భర్తతో పాటు, ఓ పోలీస్ కానిస్టేబుల్ భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. పేకాట కేంద్రంలో రూ.7 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల చొప్పున రౌండ్స్‌లో గేమ్ ఆడుతున్నట్లు తెలిసింది. ఒక వేళ ఈ పేకాట స్థావరానికి పోలీసులు వెళ్తున్నారనే సమాచారం ఉంటే కానిస్టేబుల్ ద్వారా నిర్వాహకులకు వెంటనే తెలుస్తుంది. వెంటనే అక్కడి నుంచి మకాం మార్చివేస్తారని చెబుతున్నారు.అదేవిధంగా నగరంలోని దుబ్బా ప్రాంతంలోనూ మాజీ ప్రజాప్రతినిధి భర్త, కానిస్టేబుల్ అనుచరుల ద్వారా పేకాట కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)లో మహిళలకు టైలరింగ్‌(కుట్టు మిషన్‌), బ్యూటీ పార్లర్‌ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్‌ ఎస్‌ శ్రీనివాస్‌ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 19 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. టైలరింగ్‌, బ్యూటీ పార్లర్‌ కోర్సుల్లో 30 రోజుల శిక్షణనిస్తారని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజనం, హాస్టల్‌ వసతి ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో నేర్చుకోవడానికి కావాల్సిన మెటీరియల్‌, బుక్స్‌, యూనిఫామ్‌ అందిస్తారని వివరించారు. 19–45 ఏళ్లు ఉండి నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పదో తరగతి మెమో, 5 ఫోటోలు తీసుకుని డిచ్‌పల్లిలోని ఆర్‌ఎస్‌ఈటీఐ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు. వివరాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 08461 222428, 08461 295428 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



బోధన్‌రూరల్‌: సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో కుక్కల దాడిలో జింక గాయపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బోధన్‌ రూరల్‌ ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాలు.. కుమ్మన్‌పల్లి శివారులో కుక్కల దాడిలో గాయపడిన జింకను గమనించి గ్రామస్తులు బోధన్‌ రూరల్‌ పోలీసులకు అప్పగించారు. జింకను ఫారెస్ట్‌ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

పాత నాణేలకు డబ్బులిస్తామని టోకరా

బాన్సువాడ: పాత నాణేలు తీసుకొని డబ్బులు ఇస్తామని ఓ వ్యక్తికి సైబర్‌ నేరగాళ్లు రూ.52 వేలు టోకరా వేశారు. ఈ ఘటనపై బాధితుడి తండ్రి సోమవారం బీర్కూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. బీర్కూర్‌ మండలం తిమ్మాపూర్‌కు చెందిన లక్ష్మయ్య కుమారుడి ఫేస్‌బుక్‌ ఖాతాలో పాత నాణేలు ఇస్తే రూ.77 లక్షలు ఇస్తామని వీడియో కనిపించింది. దీంతో సదరు నంబర్‌కు ఫోన్‌ చేయగా మొదట రూ.750 ట్యాక్స్‌ రూపంలో చెల్లించాలని చెప్పడంతో బాధితులు పంపారు. ఇలా విడతల వారీగా రూ.52 వేలను ఫోన్‌ పే ద్వారా పంపించారు. తర్వాత మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బీర్కూర్‌ ఏఎస్సై సీతారామమ్మ తెలిపారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహమేది?

- విత్తనాలు, డ్రిప్‌ పరికరాలపై సబ్సిడీ ఎత్తేసిన ప్రభుత్వం
- ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం



నల్లవెల్లిలో సాగవుతున్న కూరగాయల పంటలు

ఇందల్వాయి: కూరగాయల సాగుకు ప్రభుత్వం నుంచి రాయితీతో కూడిన ప్రోత్సాహకాలు లేకపోవడంతో రైతులకు సాగు భారమైంది. రైతులకు సరైన అవగాహన లేకపోవడం, పండించిన పంటను అమ్ముకునేందుకు మార్కెట్ల లేమి కారణంగా నష్టాలు చవి చూస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో కూరగాయల సాగు ప్రతి ఏటా తగ్గుతూ వస్తోంది. నియోజకవర్గంలో ఏడాదిలో వెయ్యి ఎకరాలకు పైగా కూరగాయల సాగు లక్ష్యం కాగా అందులో సగం విస్తీర్ణంలో కూడా సాగు చేయకపోవడం గమనార్హం. గతంలో కూరగాయల సాగుకు అవసరమైన రాయితీతో కూడిన విత్తనాలు, మొక్కలు, బిందు సేద్యం పరికరాలు, కూరగాయలు తరలించే ప్లాస్టిక్‌ పెట్టెలు, నారు పెంచే ట్రేలు ఇలా పలు రకాలుగా రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందేవి. ఇప్పుడు వీటిలో ఏవీ అమలు చేయడం లేదు. గత ఏడాది వరకు పందిరి సాగు, మల్చింగ్‌ షీట్‌లపై రాయితీ అందించిన ప్రభుత్వం ఈసారి వీటికి కూడా నిధులు కేటాయించలేదు. ముఖ్యంగా కూరగాయల సాగుకు అవసరమైన బిందు సేద్యం పరికరాలపై ఐదేళ్లుగా ఎలాంటి రాయితీ లేకపోవడంతో రైతులు క్రమంగా సాగును తగ్గిస్తున్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో కూరగాయల సాగుపై అనాసక్తి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విక్రయించడంలోనూ సమస్యలే..

రైతులు కూరగాయలు పండించడానికి ఎంత కష్ట పడుతున్నారో వాటిని మార్కెట్‌కి తరలించి విక్రయించడంలోనూ అంతే కష్ట పడాల్సిన పరిస్థితి. కూరగాయలు విక్రయించే వారాంతపు సంతల్లో కనీస సౌకర్యాలు లేక పోవడమే ఇందుకు కారణం. ఆఖరుకు అక్కడ తాగు నీరు, మూత్రశాలలు కూడా అందుబాటులో లేవు.

సౌకర్యాలు కల్పించాలి



పండించిన కూరగాయలు విక్రయించేందుకు ఎక్కడా సరైన మార్కెట్లు లేవు. దీంతో చేసేది ఏమీలేక మండల కేంద్రాల్లో కూరగాయలు విక్రయించాల్సిన పరిస్థితి. ఇలాంటి బాధలు పడలేక రైతులు కూరగాయల సాగును తగ్గిస్తున్నారు. –గణేష్‌రెడ్డి, రైతు, మైలారం

రాయితీలు ఇవ్వాలి



కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై డ్రిప్‌ పరకరాలు, విత్తనాలు ఇవ్వాలి. దీనికి తోడు దళారీ వ్యవస్థను నిర్మూలించాలి. –సతీష్‌రెడ్డి, రైతు, డిచ్‌పల్లి

ప్రాజెక్టు వద్ద ‘స్కాడా’ ఏర్పాటు!

- ఫ్లడ్‌కంట్రోల్‌ రూం నుంచే గేట్ల ఆపరేటింగ్‌



కంట్రోల్‌ రూంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌



ప్రాజెక్ట్‌ వద్ద ఫ్లడ్‌ కంట్రోల్‌ రూం

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ వద్ద ఫ్లడ్‌ కంట్రోల్‌ రూంలో స్కాడా(సూపర్‌వైజరి కంట్రోల్‌, డాటా అక్విజేషన్‌) విధానాన్ని ఏర్పాటు చేశారు. ఈ విధానం ద్వారా పర్యవేక్షణ నియంత్రణ, డేటా సేకరణ పక్కాగా ఉంటుందని ప్రాజెక్టు అధికారులు తెలుపుతున్నారు. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు వద్ద ఆనకట్టపై మరో కంట్రోల్‌ రూంతో పాటు స్కాడా విధానం ఏర్పాటుకు ప్రభుత్వం వేసవిలో రూ.50 లక్షల నిధులను మంజూరు చేసింది. దీంతో స్కాడా విధానం పనులు ప్రారంభించి పూర్తి చేశారు. దీని ద్వారా ఫ్లడ్‌ కంట్రోల్‌ రూంలో నుంచే వరద గేట్లను కూడా ఆపరేటింగ్‌ చేయచ్చు. ఇది వరకు వరద గేట్లను మ్యాన్‌వల్‌గా గేట్‌ వద్దకు వెళ్లి బటన్‌ నొక్కి ఎత్తేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ఫ్లడ్‌ కంట్రోల్‌ రూం నుంచే బటన్‌ నొక్కి గేటును ఎత్తేలా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది భారీ వరదలు వచ్చి మిగులు జలాలను గోదావరిలోకి వదిలే పరిస్థితి వస్తే స్కాడ ట్రయల్‌ రన్‌ జరిగే అవకాశం ఉంది. దీంతో పర్యవేక్షణ పక్కాగా ఉండటంతో ప్రతి నీటి చుక్కకు లెక్క పక్కాగా ఉంటుందని అధికారులు అంటున్నారు. ఫ్లడ్‌ కంట్రోల్‌ రూంలో సీసీ కెమెరాల ద్వారా నీటి మట్టాన్ని, గేట్లను పర్యవేక్షించే విధంగా భారీ స్క్రీన్‌ ఏర్పాటు చేశారు.

గొల్లకుర్మలు లేకున్నా.. గొర్రెలు ఇచ్చారట



తలమడ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రాజంపేట: మండలంలోని తలమడ్ల గ్రామంలో గొల్లకుర్మలు లేకున్నా గొర్రెల యూనిట్లు పంపిణీ చేసినట్లు బీఆర్‌ఎస్‌ నాయకులు ప్రచార ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 14 మందికి రూ.13.25 లక్షలను వెచ్చించి గొర్రెల యూనిట్లు పంపిణీ చేసినట్లు ఫ్లెక్సీలలో పేర్కొన్నారు. తమ గ్రామంలో గొల్ల కుర్మలు లేకున్నా అధికార పార్టీ నాయకులు ఇలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు జొన్నాల నర్సింలు అధ్యక్షతన సోమవారం నగరంలో తిలక్‌గార్డెన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి మోహన్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బోడిగం నరేష్‌, ప్రధాన కార్యదర్శి కొత్వాల్‌ సాయిబాబ, కోశాధికారి లింగంపల్లి సురేందర్‌, గౌరవ అధ్యక్షులు సంగెం సాయిలు, గౌరవ సలహాదారులు దేశాయి గంగాధర్‌, ఉపాధ్యక్షులు జి ప్రభాకర్‌, హన్మండ్లు, కార్యదర్శులుగా రవితేజ, గంధం నారాయణ, శివ, సాయిలు, సత్యనారాయణ ఎన్నికయ్యారు.

ట్రాక్టర్‌ ట్రాలీ చోరీ

రుద్రూర్‌: రుద్రూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రాయకూర్‌ క్యాంపులో కొత్తపల్లి వెంకయ్య బాబుకు చెందిన ట్రాక్టర్‌ ట్రాలీని దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌హెచ్‌వో రవీందర్‌ తెలిపారు. ఈ నెల 14న ఇంటి సమీపంలో ట్రాలీ ఉంచారు. అప్పటి నుంచి అటు వైపు వెళ్ల లేదు. సోమవారం మధ్యాహ్నం ట్రాలీతో పని ఉండడతో తీసుకురావడానికి వెళ్లగా కన్పించలేదు. చోరీకి గురైనట్లుగా గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మోపాల్‌: మండలంలోని సిర్‌పూర్‌ గ్రామానికి చెందిన దీపిక (23) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని స్వర్ణ, శ్యాం దంపతుల కుమార్తె దీపిక. ఆదివారం కుటుంబ కలహాలు కారణంగా ఆమె పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నిర్వహణ.. నిర్లక్ష్యం

జీజీహెచ్‌లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం



జిల్లా జనరల్‌ ఆస్పత్రి



ఆస్పత్రి భవనం వెనక వైపు లీకవుతున్న డ్రెయినేజీ పైపులు

నిజామాబాద్‌ ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలోకి అడుగుపెడితే అంతా ఆగమాగం అన్నట్లుగా ఉంటుంది. ప్రభుత్వం అన్నిరకాలుగా భవనాలు, మౌలిక సౌకర్యాలు కల్పించినప్పటికీ అధికారులు సక్రమంగా పట్టించుకోని దైన్యం నెలకొంది. ప్రతిరోజూ 800 మందికి పైగా అవుట్‌ పేషంట్లు వచ్చే ఈ ఆస్పత్రిలో పారిశుధ్యం నిర్వహణ విషయంలో పూర్తి నిర్లక్ష్యం కనపడుతోంది. చుట్టూ డ్రెయినేజీల నిర్వహణ విషయంలో ఏమాత్రం పట్టింపు లేకుండా పోయింది. పలుచోట్ల మ్యాన్‌హోల్స్‌ మట్టితో పూడుకుపోయాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోతోంది. చివరకు మంచినీళ్ల తాగే ప్రాంతాల్లోనూ అపరిశుభ్రత కనిపిస్తోంది. ఏడంతస్తుల భవనానికి అనేక చోట్ల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. దీంతో పేషంట్లు ఆ కిటికీలకు వస్త్రాలు కట్టుకుంటున్నారు. బాత్రూంలు లీకేజీ అవుతుండడంతో భవనంలోని అన్ని ఫ్లోర్ల నుంచి భారీ లీకేజీలు అవుతున్నాయి. ఆస్పత్రి వెనుక దుర్వాసన వస్తోంది. సోమవారం ‘సాక్షి’ విజిట్‌లో అధ్వానంగా మారిన పారిశుధ్యంపై తీసిన చిత్రాలు..

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



అద్దాలు పగిలిన కిటికీలు



బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలో వరుస ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్‌, పీవైఎల్‌ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం డిమాండ్‌ చేశారు. సోమవారం వారు మెడికల్‌ కాలేజీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ కళాశాలలో తరచుగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆత్మహత్యలు నివారించడంలో అధికారులు విఫలం అయ్యారని ధ్వజమెత్తారు. జూనియర్‌, సీనియర్‌ విద్యార్థుల మధ్య సమన్వయం లేకపోవటంలో అధికారుల పాత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్‌, భాస్కర్‌, దేవిక, సునీల్‌, సాయిలు, వంశీ పాల్గొన్నారు.

రామ మందిరం భూమికి కంచె ఏర్పాటు

బిచ్కుంద: మండల కేంద్రంలో రామ మందిరం భూములు కబ్జా చేసుకున్నారని ఆరోపిస్తూ చైర్మన్‌ హాజి బాల్‌రాజ్‌ సోమవారం షెడ్లు ఆక్రమించుకొని వేసుకున్న హద్దు రాళ్లను తొలగించారు. పిచ్చమొక్కలు తొలగించి భూమికి కంచె ఏర్పాటు చేశారు. సుమారు ఒకటిన్న ఎకరం భూమి కబ్జాకు గురైంది. మండల కేంద్రంలోని రాజుల్లా చౌరస్తాలో సర్వే నెంబరు–1092లో 0.29 గుంటలు, సర్వేనం–1094లో 1.33 గుంటల వ్యవసాయ భూమి మందిరం ఆధీనంలో ఉంది. గతంలో ఉన్న ఆలయ కమిటీ చైర్మన్‌, సభ్యులు అక్రమాలకు పాల్పడి ప్లాట్ల చొప్పున తక్కువ ధరకు ఇతరులకు విక్రయించారు. కొందరు అక్రమంగా కొనుగోలు చేయగా మరికొందరు ఆక్రమించుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఆలయ భూమిగా ఉంది. ఫిర్యాదు చేసినా ఎండోమెంట్‌ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమించుకున్న వ్యక్తులకు ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి ఉండడంతో అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగువేస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆలయ చైర్మన్‌ బాల్‌రాజ్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా కబ్జా చేసిన స్థలం వదిలేయాలని ఆక్రమించిన వ్యక్తులు ఒత్తిడి చేస్తున్నారు. ఆనను పదవి నుంచి తొలగించాలని రాజకీయ నాయకులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

మిట్టపల్లిలో దొంగల బీభత్సం

- పలు ఇళ్లలో చోరీ



దొంగతనం వివరాలు తెలుసుకుంటున్న సీఐ కృష్ణ

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని నాలుగు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. మరి కొందరి ఇళ్లల్లో దొంగతనం చేయడానికి యత్నించగా అప్పటికే గ్రామస్తులు మేల్కొని అప్రమత్తం కావడంతో పరారయ్యారు. నాలుగు రోజుల క్రితమే గ్రామంలోని రేణుక ఎల్లమ్మ, కృష్ణమందిరం ఆలయాల్లో చోరీకి పాల్పడిన విషయం మరవక ముందే మళ్లీ గ్రామంలోని నాలుగిళ్లల్లో దొంగతనం జరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయాన్నే చోరీ సమాచారం అందుకున్న డిచ్‌పల్లి సీఐ కృష్ణ గ్రామాన్ని సందర్శించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీఆర్‌ఏ సురేశ్‌ ఇంటి తాళాలు ధ్వంసం చేసి బీరువాలో ఉన్న రూ.లక్షా 50 వేలు, తులం బంగారు కమ్మలు, రెండు తులాల వెండి ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. బెడిద చిన్న రాజన్న ఇంట్లో నుంచి 10 తులాల వెండి పట్టీలు, రూ.3వేల నగదు, నడిపి రాజన్న ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి రూ.40వేలు నగదు, బంగారు ఉంగరాలు, వెండి బ్రాస్లెట్‌, ఎల్‌ఈడీ టీవీ తో పాటు భూమి పట్టా పాస్‌పుస్తకాలను కూడా చోరీ చేశారు. అలాగే మాసిపెద్ది స్కూల్‌ రాజన్న, నడిపి రాజన్న, చిల్ల నడిపి గంగారం ఇళ్ల తాళాలు ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. రాత్రి వేళల్లో యువత గస్తీ నిర్వహించాలని, గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సీఐ సూచించారు.

గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్‌ అర్బన్‌ : గురుకుల విద్యాసంస్థల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ రాష్ట్ర కార్యదర్శి డి. సత్యానంద్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ధర్నాచౌక్‌ వద్ద గురుకుల ఉపాధ్యాయులు చేపట్టిన నిరసన దీక్షను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేసినప్పటికీ సొంత భవనాలు నిర్మించలేదన్నారు. ఉపాధ్యాయుల్లేక విద్యాబోధనపై ప్రభావం పడుతుందన్నారు. కేర్‌టేకర్‌, డిప్యూటీ వార్డెన్లను నియమించి ఉపాధ్యాయులను నైట్‌ డ్యూటీల నుండి మినహాయించాలని, ఆదివారం, పండుగ సెలవుల్లో విధులు నిర్వహించిన వారికి వీక్‌ ఆఫ్‌ ఇవ్వాల అన్నారు. అని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించి, వసతరులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మల్లేష్‌, ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్‌, జిల్లా కార్యదర్శులు బాబులు, శ్రీనివాస్‌ తోపాటు గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం : యువకుడిపై కేసు

నవీపేట: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై అత్యాచారం, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి సోమవారం రాత్రి తెలిపారు. మండలంలోని ఓ తండాకు చెందిన ఓ యువతిని మరో వర్గానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకుని బలవంతంగా మతం మార్చాడు. తరువాత యువతి అభిప్రాయానికి భిన్నంగా వ్యవహరించడంతో మళ్లీ తల్లిదండ్రులను ఆశ్రయించి, మోసపోయినట్లు వాపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సదరు యువకుడిపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో అరెస్ట్‌



నిందితుడి అరెస్ట్‌ చూపుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

- రూ.7.60 లక్షల విలువైన కాపర్‌వైర్‌ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌ వైర్లను దొంగిలించే ముఠా సభ్యుడిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. అతడి నుంచి ఏడున్నర క్వింటాళ్ల కాపర్‌ వైర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న బాన్సువాడ డివిజన్‌లోని పిట్లంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో నిజామాబాద్‌కు చెందిన దండ్ల బాబు గోనె సంచిలో ఏదో వస్తువు తీసుకుని వెళ్తూ.. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడిని పట్టుకున్నారు. బాబు వద్ద ఉన్న సంచీలో కాపర్‌ వైర్లు ఉండడంతో పోలీస్‌ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా పలు చోట్ల ట్రాన్స్‌ఫార్లలో ఉన్న కాపర్‌ వైర్లు దొంగిలించినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. బాబుపై 16 కేసులు ఉన్నాయని, గతంలో జైల్లో ఉన్న సమయంలో బిచ్కుందకు చెందిన షంశిర్‌సింగ్‌, నాందేడ్‌కు చెందిన ఫఖర్‌గోరేతో పరిచయం ఏర్పడిందని, ముగ్గురు జైలు నుంచి వచ్చాక కామారెడ్డి జిల్లాలోని పిట్లం, బీర్కూర్‌, నస్రూల్లాబాద్‌, బిచ్కుంద, మద్నూర్‌, గాంధారి, భిక్కనూర్‌ మండలాల్లో రోడ్ల పక్కన వ్యవసాయ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న కాపర్‌ వైర్లను దొంగిలించారని తెలిపారు.

నిందితులు మొదట ట్రాన్స్‌ఫార్మర్లకు సప్లయి అయ్యే మెయిన్‌ వైరును కర్రతో కొట్టి సరఫరా నిలిచిపోయేలా చేస్తారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందపడేసి ఆయిల్‌ కారిపోగానే షీట్‌ను తొలగించి కాపర్‌ వైరును ఎత్తుకెళ్తారని ఎస్పీ వివరించారు. కొంత కాపర్‌ వైరును అక్కడక్కడ అమ్ముకుని, మిగిలిన వైర్లను బీదర్‌(కర్ణాటక)కు తీసుకెళ్లి విక్రయించే వారని తెలిపారు. అదే క్రమంలో దండ్ల బాబు దొరికాడని, మిగిలిన వైర్లు నిజామాబాద్‌లోని ముబారక్‌ నగర్‌లో దండ్ల బాబు ఇంటి వద్ద దొరికిందని చెప్పారు. బాబు ఇంటి వద్ద 9.5 క్వింటాళ్ల కాపర్‌ వైరు దొరికిందని, దీని విలువ రూ.7.60 లక్షలు ఉంటుందన్నారు. మరొక దొంగ బిచ్కుందకు చెందిన షంశిర్‌ సింగ్‌ పరారీలో ఉన్నాడని, నాందేడ్‌కు చెందిన ఫఖర్‌గోరే ఇదే కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్నాడని తెలిపరాఉ. కేసును చేధించిన బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, రూరల్‌ సీఐ మురళి, సీసీఎస్‌ సీఐ మల్లేశంగౌడ్‌, పిట్లం ఎస్సై విజయ్‌, సీసీఎస్‌ ఎస్సై ఉస్మాన్‌, ఏఎస్సై రాజేశ్వర్‌, హెడ్‌కానిస్టేబుల్‌ సురేందర్‌, కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌, సుభాష్‌, హోంగార్డ్‌ సంగమేశ్వర్‌ను ఎస్పీ అభినందించారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్‌ మృతి



సంగీత (ఫైల్‌)

బోధన్‌టౌన్‌: పట్టణంలోని శక్కర్‌నగర్‌ కాలనీలో నివాసం ఉంటున్న మాజీ కౌన్సిలర్‌ పెర్క సంగీత ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. బోనాల పండుగ సందర్భంగా ఉదయం బోనం ఎత్తుకొని వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం నిజామాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటు రావడంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2014 మున్సిపల్‌ ఎన్నికల్లో పట్టణంలోని శక్కర్‌నగర్‌ నుంచి ఐదో వార్డు కౌన్సిలర్‌గా ఆమె గెలుపొందారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



షారుక్‌ మృతదేహం

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన యూసుఫ్‌ అలియాస్‌ షారుక్‌ (33) సోమవారం గ్రామ సమీపంలోని బతుకమ్మ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య నిఖత్‌, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిఖత్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కడుపునొప్పితో యువకుడు..

సదాశివనగర్‌: కడుపునొప్పి భరించలేక మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఓ యువకుడు ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సాగర్‌ తెలిపారు. గ్రామానికి కంకటి రాజా సందీప్‌(24) కొన్ని రోజుల నుంచి కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఆస్పత్రిలో చూపించినా నయం కాలేదు. ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లోకి చొరబడి చైన్‌స్నాచింగ్‌

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌లోని మహాలక్ష్మి మందిరం సమీపంలో విద్యానగర్‌ కాలనీలో దొంగ ఓ ఇంట్లోకి చొరబడి రెండున్నర తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. వివరాలు.. కాలనీకి చెందిన రాజవ్వ ఇంట్లో బీడీలు చేస్తూ టీవీ చూస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన దొంగ ఆమెను కిందకు తోసేసి మెడలో నుంచి రెండున్నర తులాల గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చే సరికి దొంగ పారిపోయాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం మల్లారెడ్డి చెరువు సమీపంలో బైక్‌పై వెళ్తున్న శ్యామల మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు.